ప్రజాశక్తి
శుక్రవారం 6 జూన్ 2025 5 అనంతపురం





సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత

తమ్ముళ్ల కోల్డ్ వార్..!



◆ టిడిపి నాయకుడు సుధాకర్ హత్యకు కుట్ర?

◆ ఎస్పీకి ఫిర్యాదు.. రహస్య విచారణ

◆ అధిష్టానం నుంచి నేతలకు పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతల మధ్య వర్గ పోరు తారస్థాయికి చేరుకుంది. ఎమ్మెల్యే దగ్గుబటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సుధాకర్ నాయుడు మధ్య విభేదాలు రోజురోజుకి ముదురుతున్నాయి. 2024 ఎన్నికల్లో టిడిపి నేత సుధాకర్ నాయుడు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపు కోసం కషి చేశారు. మొదట్లో అంతా సవ్యంగానే సాగుతున్నప్పటికీ గత కొంతకాలంగా అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేపై వ్యతిరేకత వస్తుందని సుధాకర్ నాయుడు ఎమ్మెల్యే అనుచరులతో చెప్పడంతో వివాదం మొదలైంది.

సుధాకర్ నాయుడు హత్యకు కుట్ర.?

తెలుగుదేశం పార్టీ నాయకుడు సుధాకర్ నాయుడు తనకు ఎమ్మెల్యే అనుచరులతో ప్రాణహాని ఉందని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇద్దరు అధికార పార్టీ నేతలు కావడంతో ఎస్పీ జగదీష్ అత్యంత గోప్యంగా దీనిపై విచారణ చేపట్టారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని నేతల మధ్య వివాదాన్ని ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక సమర్పించారు. ఎమ్మెల్యే అనుచరులు సుధాకర్ నాయుడుని చంపేస్తామంటూ బెదిరించారని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

అధిష్టానం నుంచి నేతలకు పిలుపు

తమ్ముళ్ల మధ్య కోల్డ్ వార్, పోలీసుల కేసుల నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, సుధాకర్ నాయుడులను టిడిపి అధిష్టానం విజయవాడకు రావాలని పిలిచింది. అధిష్టానం పిలుపుతో అర్బన్ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు చేస్తున్న దందాలను గుర్తు చేసినందుకే తనను అంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని టిడిపి అధిష్టానానికి సుధాకర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే అంశంపై ఇద్దరు నేతలతో కూడా అధిష్టానం చర్చించినట్లు సమాచారం. ఈ వివాదానికి ఇంతటితో ఫుల్‌స్టాప్ పెట్టే బాధ్యతను టిడిపి సీనియర్ నేత కోవెలపూడి రవీంద్రకు అప్పగించారు.

అనంతపురంలో వర్గ పోరు

2024 ఎన్నికలో ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు అనూహ్యంగా టిడిపి టికెట్ దక్కింది. ఎన్నికల అనంతరం అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వర్గపోరు మొదలైంది. 2024 ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీటును మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, సుధాకర్ నాయుడులు ఆశించారు. అధిష్టానం మాత్రం దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు కేటాయించింది. పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని అధినేత పలమార్లు చెప్పడంతో ఆ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేశారు. అనంతరం జరిగిన పరిణామాలతో పార్టీకి కష్టపడిన వారిని ఎమ్మెల్యే అనుచరులు దూరం పెడుతున్నారని ఆరోపణలు వినిపించాయి. ఎమ్మెల్యేకు కార్యకర్తలకు నగరంలోని ప్రధాన నాయకులకు ఎమ్మెల్యే దగ్గరకు కూడా వెళ్లనివ్వకుండా అడు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి అనంతపురంలో కనిపిస్తోంది.



వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం

◆ మొదటి రోజు లాంఛనంగా పంపిణీ

◆ నేటి నుంచి పూర్తి స్థాయిలో అందించేలా ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురం, ఆత్మకూరు

సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీని గురువారం అనంతపురం జిల్లాలో లాంఛనంగా ప్రారంభం అయ్యింది. శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం పంపనూరు రైతు సేవా కేంద్రంలో మొదటి రోజు విత్తనకాయల పంపిణీని కలెక్టర్ వినోద్ కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో ప్రారంభించారు. విత్తన కాయల కోసం ఇప్పటి వరకు జిల్లాలో 13,008 మంది రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 11406 క్వింటాళ్ల రైతులకు అందజేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 22 వేల క్వింటాళ్ల విత్తనకాయలను గోదాముల్లో నిలువ ఉంచినట్టు ఎపి సీడ్స్ అధికారులు చెబుతున్నారు. వచ్చే డిమాండ్‌ను బట్టి ఎక్కడా ఇబ్బంది లేకుండా వేరుశనగ విత్తనకాయలు అందజేస్తామంటున్నారు.

పంపనూరులో రైతులకు పంపిణీ చేసిన అందించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరులో పంపణీ కార్యక్రమాన్ని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతలు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న వేరుశనగ విత్తనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాకు 50,592 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని కేటాయించామన్నారు. వేరుశనగ లోడ్ గ్రామానికి వచ్చినప్పుడు వ్యవసాయ అధికారులు తనిఖీ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విత్తన పంపిణీని అధికారులు పరిశీలించి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 30 కేజీల ఒక బ్యాగ్ పూర్తి ధర రూ.2,790కాగా, రూ.1,116 సబ్సిడీ పోను రైతు రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలను రైతులు బాగున్నాయా లేదా అని నాణ్యత చూసి తీసుకోవాలన్నారు. నాణ్యత బాగుంటే తీసుకోవాలని లేకపోతే వెనక్కి ఇచ్చేయాలన్నారు. రైతులకు సరపడా పూర్తి స్థాయిలో విత్తనాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, ఎస్డీసీ రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ రవి, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఏవోలు సోమశేఖర్, శ్రీవాణి, రాకేష్, శశికళ పాల్గొన్నారు.

పకడ్బందీగా డీఎస్సీ పరీక్షల నిర్వహణ

◆ జిల్లాలో 7 కేంద్రాల్లో పరీక్షలు ◆ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయండి ◆ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం



డీఎస్సీ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో శుక్రవారం నాడు జరగనున్న మెగా డీఎస్సీ - 2025 నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నాడు కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మెగా డీఎస్సీ - 2025 నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ టీచర్స్ రిక్రూట్మెంట్ పరీక్షలు ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో అనంతపురం నగరంలో ఐదు, గుత్తి, తాడిపత్రి పట్టణాల్లో ఒక్కో కేంద్రం ఉందన్నారు. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, మధ్యాహ్నం 02:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు డిఆర్ఒ ఇన్‌ఛార్జి అధికారిగా వ్యవహరిస్తారన్నారు. కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలను తాను కూడా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ.మాలోల, డీఎస్సీ వెంకటేశులు, డిఇఒ ప్రసాద్ బాబు, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వివరాలు

1.శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రోటరీపురం, బుక్కరాయసముద్రం మండలం, అనంతపురం.

2.అనంతలక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, ఇటుకలపల్లి, ఎస్‌కెయు, అనంతపురం.

3.శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హంపాపురం, ఎన్.హెచ్7, అనంత పివిసి పైప్స్ వద్ద, రాప్తాడు మండలం, అనంతపురం.

4.నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, ప్లాట్ నెంబర్ 50, 51, 8వ క్లాస్, చిన్మయ నగర్, ప్రసన్నాయ పల్లి, ఎల్ఆర్‌జి స్కూల్ వద్ద, అనంతపురం.

5.గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్.హెచ్44, గుత్తి అనంతపురం విలేజ్, పెద్దవడుగూరు మండలం, అనంతపురం జిల్లా, గుత్తి.

6. శ్రీ సివి.రామన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, భారత్ పెట్రోల్ బంక్ వద్ద, అనంతపురం రోడ్డు, తాడిపత్రి.

7.పివివికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రుద్రంపేట, సనప రోడ్, అనంతపురం.

పారిశుధ్య సామగ్రి కొను'గోల్'మాల్..!

◆ రూ.15 లక్షలతో నాసిరకం వస్తువులు కొనుగోలు

◆ రెండు రోజులకే విరిగి మూలన పడ్డ పుష్‌కార్ట్

◆ టెండర్.. ఎం బుక్ లేకుండానే బిల్లుల చెల్లింపు

◆ 'కార్పొరేషన్' తీరుపై విమర్శలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య విభాగం సామగ్రి కొను'గోల్'మాల్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. టెండర్, ఎంబుక్ నమోదు లేకుండా వీటిని కొనుగోలు చేశారు. కొందరు నేతల సిఫార్సుతో నిబంధనలను పక్కన బెట్టి వీటిని కొన్నట్లు తెలుస్తోంది. వస్తువుల నాణ్యత ప్రమాణాలను కనీసం పట్టించుకోకుండా వాటిని కొనడంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి.

కార్పొరేన్ పారిశుధ్య విభాగానికి అవసరమ్యే సామగ్రిని నాలుగు నెలల క్రితం అర్బన్ ముఖ్య నేత సిఫార్సుతో కొనుగోలుకు సిద్ధం అయ్యారు. హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, ఇంజినీరింగ్ శాఖ ప్రమేయం లేకుండానే సామగ్రి సరఫరా పనిని అధికార పార్టీ నేత అనుచరుడికి ఇచ్చారు. రూ.15 లక్షల విలువజేసే పారిశుధ్య సామగ్రిని సదరు నేత కార్పొరేషన్ పారిశుధ్య విభాగానికి అందించారు. వీటి కొనుగోలు వ్యవహారంపై వివాదం నెలకొనడంతో రెండు నెలల పాటు రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఈ వస్తువులను పంపిణీ చేయకుండా అలాగే ఉంచేశారు. నాలుగు రోజుల క్రితం కాలువల్లో చెత్త, మట్టి తరలింపు తోపుడు పరికరాలను సచివాలయాల వారీగా కార్పొరేషన్ అధికారులు పంపిణీ చేశారు. ఈ సామగ్రిని తీసుకుని కార్మికులు విధుల్లోకి వెళ్లారు. రెండవ సర్కిల్లో లాగుడుబండ్లలోకి కాలువల మట్టిని ఎత్తి ముందుకు తోయక మునుపే ఆ వస్తువులు భాగాలు విడిపోయి కిందపడ్డాయి. కనీసం ఒక రోజు కూడా వినియోగించకుండానే తోపుడు బండి చక్రాలు ఊడిపోవడం ఆ వస్తువు నాణ్యతను తేటతెల్లం చేస్తోంది. గుత్తేదారుడు ఇచ్చిన సామాగ్రి నాణ్యమైనదా.. లేక నాశిరకంగా ఉందా అని పరిశీలించకుండానే అర్బన్ నేత ఒత్తిడి మేరకు అధికారులు వీటిని తీసుకున్నారు. దీనికి సంబంధించి రూ.10 లక్షల చెక్కును సైతం సామగ్రి సరఫరాదారునికి కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఇప్పటికే అందించింది.

కార్పొరేషన్‌లో ఏదైనా బిల్లు చెల్లింపు సిఎఫ్ఎంఎస్ ద్వారానే జరుగుతుంది. పారిశుధ్య సామగ్రికి సంబంధించిన బిల్లును మాత్రం గతంలో ఎన్నడూ లేని విధంగా చెక్కుల రూపంలో అందజేయటం పలు విమర్శలకు తావిస్తోంది. ఇక పారిశుధ్య విభాగంలో కార్మికులకు అవసరం అయ్యే పరకలు, గంపలు, పారలు, పికాశీలు, తోపుడుబండ్లు, కొబ్బరి నూనె, వస్త్రాలు కొనుగోలు చేయాలంటే ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించి కొనుగోలు చేస్తారు. ప్రస్తుత రూ.15 లక్షల వస్తువుల కొనుగోలులో ఈ విధానానికి స్వస్తి చెప్పినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేత ఒత్తిడికి తలొగ్గి నాశిరకం వస్తువులను తీసుకోవడంతో కార్పొరేషన్‌కు పెద్ద మొత్తంలో నష్టం జరిగింది. ఎలాంటి పరిశీలన చేయకుండా సామగ్రిని తీసుకుని రూ.15 లక్షలు కార్పొరేషన్‌కు నష్టం కలిగేందుకు కారణం అయిన బాధ్యతను హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి తీసుకుంటారా.. లేక ఉన్నతాధికారి, అధికార పార్టీ ముఖ్యనేత తీసుకుంటారా అన్న ప్రశ్న ప్రజల్లో వ్యక్తం అవుతోంది.



నాశిరకంగా ఉండడంతో విరిగిపోయిన పుష్‌కార్ట్ పరికరం

విచారణ జరిపి చర్యలు తీసుకోండి

అనంతపురం నగరపాలక సంస్థలో రూ.15 లక్షలు ఖర్చు చేసి నాశిరకం సామగ్రిని కొనుగోలు చేశారు. ఇది అధికారుల బాధ్యతా రాహిత్యమే. ప్రజా ధనం ఇలా నాశిరకం వస్తువులకు వినియోగించడం సరికాదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నాశిరకం వస్తువులను అందించిన కాంట్రాక్టర్ నుంచి డబ్బులను వెనక్కు తీసుకోవాలి. నాశిరకం వస్తువును కార్మికుని ఇవ్వడం ద్వారా దానితో పని చేసేందుకు వెళ్లిన కార్మికుడు గాయపడ్డాడు. ఇలాంటి వస్తువులను ఇచ్చి కార్మికులపై పని భారం మోపడం సరికాదు.

గోపాల్, తిరుమలేశు,
మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

◆ కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత

◆ జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం



ప్రజాశక్తి-ఆత్మకూరు

విరివిగా మొక్కలు నాటడం ద్వారా కాలుష్యం తొలగి, పర్యావరణం నెలకొంటుందని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఆత్మకూరు మండలం పంపనూరు వద్దనున్న నగరవనం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సిఎఫ్ఒ యశోదబాయితో కలిసి గురువారం నాడు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. జిల్లాలో విస్తతంగా మొక్కల పెంపకం చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మాలోల, ప్రోగ్రాం అధికారి గురు ప్రభాకర్, ఆర్డీవో కేశవనాయుడు, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

చెట్టు (వచన శతకం)ఆవిష్కరణ

పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పంపనూరులోని నగరవనంలో కోటిమొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ చేతుల మీదుగా ప్రముఖ సాహితీవేత్త జూటూరు షరీఫ్ రచించిన చెట్టు (వచన శతకం)ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

వేసవి విజ్ఞాన కేంద్రం ముగింపు

యల్లనూరు : యల్లనూరు శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. విద్యార్థులు, పాఠకులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి మండల విద్యాశాఖ అధికారి-2 పరమేశ్వర రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎవి.ప్రకాష్ రెడ్డి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు శిక్షణ

యల్లనూరు : మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి-2 పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వాసుదేవరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు లోకేష్, అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎపిఒ సత్యమూర్తి పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : సిఐ

బుక్కరాయసముద్రం : మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేస్తామని బుక్కరాయసముద్రం సిఐ పుల్లయ్య తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా గురువారం నాడు ముసలమ్మ కట్ట దగ్గర ఆయన వాహనదారులతో మాట్లాడారు. వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఢిల్లీలో జరిగిన పర్యావరణ సదస్సులో మేయర్ వసీమ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో ఒక రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో అనంతపురం మేయర్ వసీమ్ పాల్గొన్నారు. ఈ సంవత్సరం "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్ మీద సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సదస్సులో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు కాలుష్యం, అనంతర పరిణామాలను వివరించారన్నారు. సమాజంలోని అన్ని రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ హితాన్ని కోరే పలు తీర్మానాలు చేసారన్నారు.



ఆర్డీటీ అంశాన్ని రాజకీయం చేయొద్దు

తలారి రంగయ్యకు ఎమ్మెల్యే అమిలినేని సూచన

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి నాయకులు తలారి రంగయ్య ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ అనుమతుల విషయాన్ని రాజకీయం చేస్తున్నారని, అది సరైంది కాదని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డిటీ సంస్థకు 2021లోనే ఎఫ్‌సిఆర్ఎ సమస్య వచ్చిందన్నారు. అప్పుడంతా మౌనంగా ఉండి, ఇప్పుడు దానిపై రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎఫ్‌సిఆర్ఎ అంశంపై రంగయ్య కళ్యాణదుర్గంలో పాదయాత్ర చేస్తే ఏమి వస్తుందని ప్రశ్నించారు. ఒక వేళ చేయాలంటే ఢిల్లీలో చేసుకోవాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ చేయలేదన్నట్టుగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం సరైంది కాదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం తరుపున అందరం కలసి ఆర్డీటీ సంస్థను కాపాడడుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఆర్డీటీకి మేలు చేసేలా కేంద్రం నుంచి కూడా సానుకూలత వ్యక్తమైందని వివరించారు.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురము జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రెల్ నెలలో నిర్వహించిన బీటెక్ ఫలితాలు విడుదల అయ్యాయి. గురువారం నాడు స్థానిక జెఎన్‌టియులో ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో గురువారం నాడు ఫలితాలు విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎపి.శివ కుమార్ తెలిపారు. రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్23) రెగ్యులర్ ఫలితాలు, రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 20), (ఆర్ 19), (ఆర్ 15) సప్లిమెంటరీ, రెండవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్ 23,20,19,15) సప్లిమెంటరీ ఫలితలు విడుదల అయ్యాయి. ఈ కార్యక్రమంలో అడిషినల్ కంట్రోలర్స్ డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితోనే కుటుంబం అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

స్వయం ఉపాధి మార్గాలతోనే కుటుంబం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబం అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అన్నారు. కుట్టు శిక్షణ ద్వారా ఉపాధి పొందిన మహిళలు కుటుంబాల ఆర్థిక వనరులను పెంపొందించుకునే దిశగా ముందుకెళ్లాలన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యార్డు చైర్పర్సన్ లక్ష్మీదేవి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దెనాయక్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రశంసించారు. పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దెనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడల్ డీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. బద్దెనాయక్ మాట్లాడుతూ ట్రస్ట్ ఎదుగుదలకు తోటి ఉపాధ్యాయులు, మిత్రుల సహాయ సహకారాలు మరువలేనివన్నారు. డ్యాన్స్ మాస్టర్లు రామకృష్ణ, మైలారం చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, ఎంఇఒలు, ఉపాధ్యాయు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.



ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

పేదలకు మెరుగైన వైద్యసేవలు

కళ్యాణదుర్గం రూరల్ : పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. కంబదూరులో రూ. 1.90 కోట్లతో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే డిఎంహెచ్ఒ ఈబీ దేవి, ఆర్డీఓ వసంతబాబులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పిహెచ్సి ప్రహరీ ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తామని, రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలోనే ఉపాధి హామీ బిల్లులు కూలీల ఖాతాల్లో జమవుతాయన్నారు. వైద్యంతో పాటు విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రాష్ట్రంలోనే నవోదయ పాఠశాల కళ్యాణదుర్గానికి కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామ్మోహన్చౌదరి, కూటమి నాయకులు మల్లికార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ

నిబంధనలకు విరుద్ధంగా శ్రీచైతన్య విద్యా సంస్థల నిర్వహణ

చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీ చేస్తున్నాయని, అనుమతులు లేకున్నా శ్రీ చైతన్య విద్యా సంస్థలు సిబిఎస్ఈ నిర్వహిస్తున్నాయని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థల కబంధ హస్తాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులను కాపాడాలని, విద్యా దోపిడీ చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్బి, బీసీఎస్ఎఫ్, మైనారిటీ విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతుర పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి పృథ్వి, బీసీ ఎస్ఎఫ్, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బిసి.సురేష్ యాదవ్ హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని పుస్తకాల పేరుతో వేల రూపాయల వ్యాపారం చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య విద్యా సంస్థలకు సిబిఎస్ఈ అనుమతి లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకాలను ఆన్లైన్ ద్వారా జోమాటో, స్విగ్గీ రూపంలో ఇంటికి శ్రీ చైతన్య విద్యా సంస్థల యాజమాన్యాలు పంపుతున్నారని చెప్పారు. అనుమతులు లేకుండా నగరంలో బ్రాంచ్లను నిర్వహిస్తున్నారన్నారు. విద్యా మాఫియా దోపిడీ జిల్లా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టకపోతే పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ శివ, గిరి, శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతు రాయుడు, కోశాధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-నార్పల

గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికలతో అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అధికారులను ఆదేశం చారు. ఎమ్మెల్యే గురువారం కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక మహిళా భక్తులు ఇబ్బందులు పడ్డారని ఆయా సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని, మద్యం విక్రయాలను శాశ్వతంగా తొలగించాలని గ్రామస్తులు కోరారు. మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సర్పంచి రమణకుమారి శివయ్య కోరారు. గూగూడును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి దత్తత తీసుకున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణకు కతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బ్రహ్మోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీవో కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు, ఎంపిడిఒ మమతాదేవి, ఈవో శోభ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసమూర్తి, ఈవోఆర్డీ శైలజారాణి, ఆర్డబ్ల్యుఎస్ డీఈ శ్రీరా ములు, సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆలం వెంకట నరసా నాయుడు, ఆకుల విజయ్కుమార్, ప్రతాప్ చౌదరి, చంద్రబాబు, రాజన్న, పాల్గొన్నారు..



కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆలయ కమిటీ ఛైర్మన్ను నియమించాలి

గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానానికి వెంటనే ఛైర్మన్ను నియమించాలని మండల సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే వెంటనే ఆలయ ఛైర్మన్ను నియమించడంతో పాటు బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయించాలని సిపిఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్, నాయకులు గంగాధర్, చాపల రామంజి, సుధాకర్ డిమాండ్ చేశారు.

నిలిచిన సత్యసాయి తాగునీటి సరఫరా..

ఇబ్బందుల్లో గ్రామీణ ప్రజలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని గొరిదిండ్ల, ముట్టాల, తదితర గ్రామాల్లో 4 వారాలుగా సత్యసాయి తాగునీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే కొర్రకోడు డ్యాంలో మోటారు కాలిపోవడం వల్ల నీటి సరఫరా ఆగిపోయిందని చెబుతున్నారు. అయితే సుమారు 4 వారాలైనా అధికారులు మరమ్మతులు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, దీంతో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. నెలలో రెండు, మూడు సార్లు మోటారు పాడవుతోందని, కొన్నేళ్లుగా మోటార్కు మరమ్మతులు చేయిస్తున్నారే తప్ప కొత్త మోటార్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కొత్త మోటారు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలో కోవిడ్ కేసు నమోదైన నేపథ్యంలో వైద్య శాఖ, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఈ విషయంపై గురువారం ఆయన డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్, మున్సిపల్ కమిషనర్ బాలాస్వామితో ఫోన్లో మాట్లాడారు. కరోనా నియంత్రణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల న్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం ఉండకూడదని, డ్రెయిన్లు శుభ్రంగా ఉండాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం శానిటరీ సిబ్బంది కాలనీల్లో పర్యటించాలన్నారు. కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. కరోనా బాధితురాలి కాంటాక్టులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కరోనా వార్డులు, అందులో అన్ని సౌకర్యాలు, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రజలు కరోనా విషయంలో ఆందోళన చెందవద్దని, అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

13న మెగా జాబ్ మేళా

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 13వ తేదీ నగరంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో 50కిపైగా నేషనల్, మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు అర్హులన్నారు. https://naipunyam.ap.gov.in/user-registration ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90100 39901, 83413 66022, 94906 82810కు కాల్ చేయాలన్నారు.



పండమేరు వంకను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

'పండమేరు'ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాప్తాడు

పండమేరు వంక పరివాహక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రాప్తాడు సమీపంలోని పండమేరు వెంకటరమణస్వామి దేవస్థానం సమీపంలో ప్రవహిస్తున్న వాగును గురువారం ఎమ్మెల్యే స్థానిక టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలని కలెక్టర్ను, గత శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఆమె వెంట సర్పంచి తిరుపాలు, మండల కన్వీనర్ కొండప్ప, కార్యకర్తలు ఉన్నారు.

నేడు రాప్తాడు మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-రాప్తాడు

అనంతపురం రూరల్ మండలంలోని కక్కలపల్లి వద్ద ఉన్న ఎస్వీఆర్ టమోటా మండీలో శుక్రవారం ఉదయం నిర్వహించే రాప్తాడు మార్కెట్ యార్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి నియోజకవర్గంలోని టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని రాప్తాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ బోయపాటి సుధాకర్ నాయుడు కోరారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఎంపి బికె.పార్థసారధి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

కక్కలపల్లి పాఠశాల హెచ్ఎంగా గొర్తి వెంకటస్వామి

ప్రజాశక్తి-అనంతపురం



రూరల్ మండలంలోని కక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా గొర్తి వెంకటస్వామి గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హెచ్ఎం ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపరచి, మొక్కలు నాటారు. విడపనకల్లు మండలం పాల్తూరు మెయిన్ స్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఈ పాఠశాలకు వచ్చారు. ప్రముఖ విద్యావేత్త, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు గొర్తి వెంకటస్వామి ఇప్పటికే ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు అందుకున్నారు.

నర్సింగ్ కోర్సుతో ఉపాధి అవకాశాలు మెండు

అభిషేక్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కార్తీక్



ప్రజాశక్తి -అనంతపురం

నర్సింగ్ కోర్సుతో ఉపాధి అవకాశాలు అపారమని అభిషేక్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ ఎం.కార్తీక్ తెలిపారు. నర్సింగ్ ప్రవేశాలకు సంబంధిచిన పరీక్షకు ఈ నెల 20వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సులో చేరాలంటే పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. బీఎస్సీ నర్సింగ్తో మెడికల్, హెల్త్ ఇన్సూరెన్స్, టీచింగ్, మెడికల్ కోడింగ్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్ బైపీసీ, ఒకేషనల్ డిప్లొమా బ్రిడ్జి కోర్సు చదివిన అభ్యర్థులు అర్హులన్నారు.

పోలీసు శాఖకు 'కిమ్స్ సవీరా' బారికేడ్ల వితరణ

ప్రజాశక్తి-అనంతపురం

కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా నగరంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి యాజమాన్యం అనంతపురం పోలీస్ విభాగానికి వంద బారికేడ్లు అందజేసింది. దీంతో గురువారం ఎస్పీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్ కిమ్స్ సవీరా ఆసుపత్రి సీఓఓ సిద్ధారెడ్డిని అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ అనంత పురం నగరం మీదుగా జాతీయ రహదారి–44తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ను నియంత్రించడానికి, ప్రమాదాలను తగ్గించడానికి ఈ బారికేడ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.



బారికేడ్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్, సవీరా ఆసుపత్రి సిఇఒ సిద్ధారెడ్డి

ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే నగదు బదిలీ

ప్రజాశక్తి-గుత్తి

ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే కూటమి ప్రభుత్వం నగదు బదిలీ విధానాన్ని ప్రవేశపెడుతోందని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మండిపడ్డారు. ప్రభుత్వం అవలంబిస్తోన్న విధానాలను వ్యతిరేకిస్తూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు ఇస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. పేదల కడుపు కొట్టేందుకే ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెడుతోందన్నారు. నగదు బదిలీ పథకం అమలు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఉప తహశీల్దార్లు లలిత, కె.సూర్యనారాయణలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, ఎన్.రేణుక, ఎం.మల్లేష్, యు.మల్లికార్జున, రామేశ్వరి, రాము, శీన, గంగాధర్, మున్ని, సావిత్రి, బావమ్మ, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతులకు రూ. 20వేల పెట్టుబడి సాయం ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వజ్రకరూరులో తహశీల్దార్ కార్యాలయం ముందు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వీరికి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతన కౌలు రైతు చట్టం అమలు చేయాలని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్, మండల నాయకులు సుంకన్న, బి.చెన్నయ్య, బి.సుంకన్న, శీన, ధనంజయ, పెద్దన్న, గౌరమ్మ, సుధాకర్, బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ఎగ్జిబిషన్, సేల్స్ స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని టవర్ క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ఎగ్జిబిషన్, సేల్స్ స్టాల్ను గురువారం కమిషనర్ బాలస్వామి ప్రారంభించారు. స్టాల్లో అరటి బెరడుతో చేసిన ప్లేట్లు, మట్టి గ్లాసులు, క్లాత్ బ్యాగ్స్, జనపనార సంచులు, జనపనార మ్యాట్స్, చెక్కతో చేయబడిన వంట సామగ్రి, ఆకులతో తయారైన విస్తర్లు, చెక్క స్పూన్స్, ఆకు కప్పులు, వెదురు బుట్టలు ప్రదర్శనకు, విక్రయానికి ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వస్తువులు కాకుండా ప్రత్యామ్నాయంగా తయారు చేసిన వాటిని ఉపయోగించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను విక్రయిస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ పావని, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విశ్వజ్యోతి, మెప్మా ఇన్ఛార్జి సిటీ మిషన్ మేనేజర్ శ్రీనివాసులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.



స్టాల్ను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

'ఉపాధి' కూలీలకు సీడ్ బాల్స్ పంపిణీ

ప్రజాశక్తి-నార్పల

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని నాయనపల్లి గ్రామంలో ఐటిసి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంపిడిఒ మమతాదేవి ఉపాధి హామీ కూలీలకు వివిధ రకాల మొక్కల విత్తనాలు(సీడ్ బాల్స్) పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పొలాల గట్లు, కొండలు, మైదాన ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో వీటిని వేయడం వల్ల వర్షాలు కురిసిన సమయంలో విరివిగా మొక్కలు పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విధిగా ఒక్క మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్డ్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి రంగారెడ్డి, నాయనపల్లి సర్పంచి మల్లీశ్వరి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుట్లూరులో సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ మూసివేత

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఎ.కొండాపురం గ్రామంలో ఉన్న సూర్య ఇంగ్లీష్ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలను మూసివేసినట్లు ఎంఇఒ పి.శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించవద్దని ఎంఇఒ తల్లిదండ్రులకు సూచించారు.

నేరాలు ఘోరాలు

నీటితొట్టెలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

నీటితొట్టెలో పడి రెండేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని చిత్రచేడు గ్రామంలో చోటు చేసుకుంది. చిత్రచేడు గ్రామానికి చెందిన నంద, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన చరణ్దీప్(2) ఇంటి ఆవరణలో ఆటలాడుకుంటుండగా అకస్మాత్తుగా నీటితొట్టెలో పడిపోయాడు. తల్లిదండ్రులు చాలాసేపు గమనించకపోవడంతో బాలుడు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఆ తర్వాత గమనించిన బంధువులు బాలుడిని చికిత్స కోసం పెద్దవడుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు శ్రీనివాసబాబు, అమర్నాథ్ తెలిపారు. దీంతో తల్లి అరుణ బాలుడిపై పడి రోదించడంతో సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో ఆమెకు వైద్యులు చికిత్స చేశారు.



మృతిచెందిన చరణ్దీప్

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

గుత్తి : పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. యాడికి మండలంలోని కొట్టాలపల్లికి చెందిన కార్తీక్(25) స్నేహితుడితో కలిసి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో జరుగుతున్న వివాహానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. స్థానిక జంగాలకాలనీ సమీపంలో 67వ జాతీయ రహదారిపై వెళుండగా ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో రోడ్డుపై పడిన కార్తీక్ పైనుంచి లారీ దూసువెళ్లింది. ఈ ప్రమాదంలో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అగ్ని ప్రమాదంలో బిందెల షెడ్డు దహనం

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామంలో ఉన్న బిందెల షెడ్డులో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన జంగాల పుల్లయ్య ప్లాస్టిక్ బిందెలు విక్రయిస్తూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో ఆయన ఇంటి సమీపంలో ఓ షెడ్డు ఏర్పాటు చేసుకొని అందులో పెద్దఎత్తున ప్లాస్టిక్ బిందెలు నిల్వ ఉంచాడు. బుధవారం అర్ధరాత్రి షెడ్డులో ఉన్న చిన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగి షెడ్డు, అందులో ఉన్న ప్లాస్టిక్ బిందెలు, ద్విచక్ర వాహనం, నాటుకోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దాదాపు రూ. 4 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

పెద్దపప్పూరు : మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో బుధవారం రాత్రి సుమారు 20 తోటల్లో దొంగలు మోటార్ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లినట్లు రైతులు వాపోయారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచా రం. దొంగలు ఇలా కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించా లని రైతులు కోరారు. రైతులు వెంకట్రామిరెడ్డి, జయరామిరెడ్డి, నాగలింగారెడ్డి, రామానుజన్రెడ్డి, ప్రతాప్రెడ్డి, చంద్రశేఖర్రెడ్డి, పెంచి వెంకటరామిరెడ్డి, నామినాగుపల్లి భాస్కర్రెడ్డి, దొరసామిరెడ్డికి చెందిన వైర్లను ఎత్తుకెళ్లారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు బ్రెయిన్ డెడ్..

'ఒక్కనానొక్క కొడుకు పెద్దవాడయ్యాడు. కుటుంబ పోషణలో తోడుంటాడని సంబరపడిన ఆ తల్లిదండ్రుల ఆశలు అంతలోనే ఆవిరయ్యాయి. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కుమారుడు మరణించడంతో వారి రోదనలు అంతా ఇంతా కాదు. ఇంత దు:ఖంలోనూ ఆ తల్లిదండ్రులు మరికొందరికి పునర్జన్మ ప్రసాదించేందుకు ముందుకొచ్చారు. తమ కుమారుడి అవయవదానికి అంగీకరంచి పలువురి మనసులు గెలుచుకున్నారు.'

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గొల్లబోట్లు ఈరన్న, అనసూయమ్మ దంపతులకు శ్రీహరియాదవ్(18) ఒక్కగానొక్క కుమారుడు. ఇంటర్ చదువున్న శ్రీహరి చదువు మానేసి తల్లిదండ్రులకు తోడుగా తోట పనులు, కూలీ పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలోనే గత ఆదివారం కళ్యాణదుర్గం ప్రాంతంలో పండ్లతోటల్లో కాయలు కోయడానికి పనికి

అవయవదానం చేసిన తల్లిదండ్రులు

వెళ్లాడు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలో గరుడాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని అనంతపురం తీసుకెళ్లి పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. అనంతరం సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం బ్రెయిన్డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో అక్కడి డాక్టర్లు యువకుడి తల్లిదండ్రులు, పిన్నతండ్రి వీరేష్యాదవ్తో చర్చించి అవయవ దానానికి ఒప్పించారు. కుమారిని కిడ్నీ, గుండె, ఇతర అవయవాలను దానం చేశారు. దీంతో ఆసుపత్రి వైద్యులు ఆ యువకుడి తల్లిదండ్రులను సన్మానించారు.



శ్రీహరియాదవ్(ఫైల్)

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'లో ప్రముఖులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రముఖులు సూచించారు. 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు.

నార్పల : మండలంలోని గూగూడు జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీ ఉపాధి హామీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నేడు పర్యావరణాన్ని పరిరక్షిస్తే భవిష్యత్తు బాగుంటుందని, లేకపోతే భవిష్యత్తు తరాలు అంధకారంలోకి పోతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు, ఎంపిడిఓ మమతాదేవి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసమూర్తి, ఈవోఆర్డీ శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ శ్రీరాములు, ఏఈ జనార్ధన్, సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, ఎంఇఒ నారపరెడ్డి, ఎపిఒ రమేష్, రామా రావు, నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల విజయ్‌కుమార్, ప్రతాప్‌చౌదరి, చంద్రబాబు, జాఫర్‌వలి, పిఎల్ లక్ష్మీనారాయణ, రాజన్న, ఓబులేసు పాల్గొన్నారు.


రాయదుర్గంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ఏడాదిలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం: ప్రభుత్వ విప్

రాయదుర్గం : నియోజకవర్గ పరిధిలో వచ్చే ఏడాది లోగా లక్ష మొక్కలు నాటాలన్నదే లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్ద జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో కాలవ పాల్గొని మొక్కలు నాటారు. అధికారులు, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం పురపాలక సంఘం పరిధిలో 3వేల మొక్కలు నాటడం లక్ష్యం పెట్టుకున్నామని, అందులో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డి, తహశీల్దార్ నాగరాజు, సిఐ జయానాయక్, మున్సిపల్ ఇంజనీర్లు రవి ప్రకాష్ నాయుడు, ప్రతాప్, నరసింహులు, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంతి, లావణ్య, పద్మజ, శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు మహబూబ్ బాషా, నాగరాజు, హనుమంతు, భారతి, పురుషోత్తం, సచివాలయ సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఉదయం ఉట్లకుంట వద్ద జరిగిన కార్యక్రమంలో గట్టుపై ఉన్న ముళ్లపొదలు, కుంటలో చెత్తచెదారం తొలగించారు.

గుమ్మగట్ట : మండలంలోని బిటి ప్రాజెక్ట్ గ్రామ కెజిబివిలో ఆవరణలో ఎమ్మెల్యే కుమారుడు కాలవ భారత్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చని చెట్లతోనే మానవాళి మనుగడ సాధ్యమని తెలిపారు. అలాగే ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ సురేష్, టిడిపి మండల్ కన్వీనర్ గిరిమల్లప్ప, నాయకులు కాలవ సన్నన్న, 75-వీరాపురం సర్పంచి నాగరాజు, డీలర్ సత్యన్నారాయణ, ఎస్ఎంసి ఛైర్మన్ రాజు, పైదొడ్డి రాజు, సంజీవ, అంజి, సూరి, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. ఎద్దులపల్లిలో ఎంపీడీవో తేజోష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ స్థలంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ మునివేలు, ఎంపీడీవో విజయభాస్కర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, అడవులను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో జమేదారు కమల్‌బాషా, ఆర్ఐ బాలకృష్ణ, ఐకెపి పిఒ రామకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, సునీత, నాయకులు, నాగరాజు, పయ్యావుల నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కొండుగారికుంట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శన నాయుడు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలంలోని జూటూరు కెజిబివి ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో శంకుతలమ్మ మాట్లాడుతూ మానవాళికి కాలుష్యం లేకుండా స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ, పంచాయతీ కార్యదర్శి, కెజిబివి ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే అమిలినేని

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ : ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం టౌన్ : పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆయన మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌తో కలిసి పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.


నార్పల మండలం గూగూడు గ్రామంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కళ్యాణదుర్గం రూరల్ : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ ధనుంజయనాథ్ సూచించారు. మండలంలోని బోరంపల్లి గ్రామంలో సర్పంచి శోభారాణి ఆధ్వర్యంలో డిప్యూటీ ఎంపీడీఓ రంగనాయకులు, ఏపీఓ పుష్ప, ఈసీ కరుణాకర్, ఉప సర్పంచి మల్లికార్జున మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మొక్కలు నాటుదాం.. ప్రగతిని సాధిద్దాం అని ఐసిడిఎస్ సూపర్వైజర్ రామాంజనమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ మనందరం కలిసి చెట్లను విరివిగా నాటుదాం, వాతావరణ కాలుష్యాన్ని తగ్గిద్దాం. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, చెన్నమ్మ, హెల్పర్ శివలింగమ్మ, హరీష్, మల్లికార్జున, ఎర్రిస్వామి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శింగనమల : స్థానిక సిహెచ్‌సి ఆవరణలో వైద్యాధికారి డాక్టర్ రోహినాథ్, పంచాయతీ కార్యదర్శి లీలారాణి, టిడిపి నాయకులు మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని, ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను నివారించి, బయోడిగ్రేడబుల్ బ్యాగులు వాడుదామని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సి.వెంకటేష్. మాసూల చంద్రమోహన్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, ప్రకాష్, నరేష్, నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీల జిల్లా అధ్యక్షుడు ఎంపీపీ పెద్దన్న పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఎంపిపి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక, ఏపీవో మురళీకృష్ణ, బాలాజీ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

యల్లనూరు : పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండల వ్యాప్తంగా అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ వాసుదేవర రెడ్డి, ఈవోఆర్డీ మనోహర్, ఇన్‌ఛార్జి ఏపీవో సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్‌లు జయరాం, కుళ్లాయి స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, నరసింహా పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న 'సుమంత్ ఎన్విరాన్‌మెంట్' సభ్యులు

సుమంత్ ఎన్విరాన్‌మెంట్ గ్రామీణ అగ్రికల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో

పెద్దవడుగూరు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీవో బారన్ సాహెబ్, ఎస్ఐ ఆంజనేయులు, ఎపిడి పుల్లారెడ్డి, ఎపిఎం ఖలీల్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా పెద్దవడుగూరులో సుమంత్ ఎన్విరాన్ మెంట్ గ్రామీణ అగ్రికల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్త్రీ శక్తి భవనం, అంగన్వాడీ కేంద్రాల వద్ద సుమారు వంద మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మానవుడి మనగడకు చెట్లే ఆధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ప్రధాన వీధుల వెంట ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, ఉపాధి ఎపిఒ విజయ్, సుమంత్ ఎన్విరాన్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు రామాంజనేయులు, ఆదర్శ మండల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, జనచైతన్య, వివేకానంద సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతపురం నగరంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు

అనంతపురం : నగరంలోని మెడికల్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్య రావు కళాశాల పచ్చదనం, పరిశుభ్రతకు నిలయంగా మారడంలో వైద్య విద్యార్థుల కృషి అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ వేముల శ్రీనివాసులు, డాక్టర్ కెఎల్.సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ సహజీర్, డాక్టర్ ప్రమోద్ జయశాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహనాయక్, పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని వివిధ ప్రాంతాల్లో 2002 మొక్కలు నాటినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బి.బాలస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు ఒక్కో మొక్కను ఒక్కొక్కరికి అప్పగించి సంరక్షించే బాధ్యతను అప్పగించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు చొరవ చూపేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఈఈ షాకిర్ హుస్సేన్, నరసింహులు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : నగర సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల ఆవరణలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.నారాయణరెడ్డి, పర్యావరణ శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.నాగిరెడ్డి ఆధ్వర్యంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సుమారు 1000 మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్. పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి, మేనేజ్‌మెంట్ రెప్రజెంటేటివ్ శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ప్లాస్టిక్ వాడకం వల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అరవింద, డాక్టర్ నాగరాజు, డాక్టర్ జీవన్, డాక్టర్ అనిల్, డాక్టర్ జవహర్‌రెడ్డి, డాక్టర్ రంజిత్, డాక్టర్ శివరూప్, రూపావతి, డాక్టర్ బసవరాజు, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ పవిత్ర, సాయినాథ్, డాక్టర్ యోగేష్, డాక్టర్ మంజుల, ప్రీతీ, వైష్ణవి, అఖిల, దీపిక, డాక్టర్ తోయిజాక్షి, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


మెడికల్ కళాశాలలో..



పివికెకె విద్యార్థులు ర్యాలీ

అనంతపురం సిటీ : నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అధికారులు మొక్కలు నాటారు. అనంతరం అధికారులతో హరిత అనంత ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షిస్తే, ప్రకృతిని కాపాడటమే కాకుండా మన ప్రాణాలను కాపాడుకున్న వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సిఇఒ వెంకటసుబ్బయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో చెట్ల పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. ఎస్ఈ శేషాద్రి శేఖర్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఈ రమేష్, ఏఓ రాజశేఖర్, డిప్యూటీ ఈఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణలో పివికెకె విద్యార్థులు

అనంతపురం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలోని పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. 'ఇంటింటా ఒక మొక్క-ప్రకృతి పరిరక్షణకు ఒక అడుగు' అనే నినాదంతో ప్రజల్లో పచ్చదనంపై అవగాహన పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డా. పల్లె కిషోర్, కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా. బండి రమేష్ బాబు, డీన్ డా. సంతోష్ రెడ్డి, ఏవో డా. మనోహర్ రెడ్డి, అమృత అభినందించారు.

ఒటిపిఆర్ఐలో

అనంతపురం : జెఎన్‌టియు అనుబంధ కళాశాల తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ఆచార్య జివి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత బి.జీవన్ కుమార్ పాల్గొని పర్యావరణ ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్టర్ బి.దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీదత్తా ఎంఎసిసి సొసైటీ లిమిటెడ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్లు, కుటుంబ సభ్యులు

శ్రీ దత్త ఎంఎసిసి సొసైటీ లిమిటెడ్ ప్రారంభం

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం నగర ప్రజలకు ఆర్థిక అభివృద్ధికి సరళమైన వడ్డీతో రుణ సౌకర్యం కల్పించేందుకు శ్రీదత్తా ఎంఎసిసి సొసైటీ లిమిటెడ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ అమృత వాణి మాట్లాడుతూ తమ సంస్థలో ఆర్‌డిలతో పొదుపు చేసుకోవచ్చన్నారు. అనంతపురం నగరంలోని ప్రధాన పోస్టాఫీసు వద్ద తమ సంస్థ ఉందన్నారు. నగర వాసులు తమ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పట్టివేత

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని టిఫిన్ సెంటర్స్, హోటళ్లలో గురువారం ప్రజారోగ్య సిబ్బంది దాడులు చేసి 117.5 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయా షాపుల యజమానుల నుంచి రూ. 33,500 జరిమానా వసూలు చేశారని కమిషనర్ బాలస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. దాడుల్లో శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, అమ్మకాలు, వాడకాన్ని నిషేధించామన్నారు. కావున ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేసి ప్రత్యామ్నాయంగా సంచులు వాడాలని సూచించారు.

నేడు పుట్లూరుకు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రమైన పుట్లూరులో శుక్రవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారని టిడిపి మండల కన్వీనర్ బాల రంగయ్య తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో మండల టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్య కళాశాలలో ఉచిత యోగా శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని వైద్య కళాశాలలో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఎస్. మాణిక్యరావు తెలిపారు. యోగా శిక్షణలో వైద్య విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు. ప్రతి రోజూ గంట పాటు యోగా, ధ్యానం చేయడం ద్వారా భావోద్వేగాలు, ఒత్తిడి అదుపులో ఉంటాయన్నారు. తద్వారా ప్రశాంతంగా జీవించవచ్చన్నారను. అనంతరం సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ వేముల శ్రీనివాసులు, డాక్టర్ కెఎల్.సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఉమామహేశ్వరరావు వైద్య విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పామిడి

పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపం అమ్మవారిశాలలో ఈ నెల 15వ తేదీ లయన్స్ క్లబ్, శంకర్ కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనంతపురం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా ఛైర్మన్ డాక్టర్ నల్లపాడు తిరుపతినాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి లోపం ఉన్న వారికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి బెంగళూరులో ఉచితంగా ఆపరేషన్ కూడా చేయిస్తారని తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

గుత్తి : వేసవి శిక్షణ తరగతుల్లో వివిధ పోటీలు నిర్వహించి విజేతలైన వారికి గ్రంథాలయ అధికారి హెచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు టి.నాగరాజు,విశ్రాంత గ్రంథాలయాధికారి ఏసీ.సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : గ్రంథాలయాలు నిత్యం విజ్ఞానాన్ని అందించే జీవనదుల్లాంటివని గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి బి.ఎర్రిస్వామి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో పుస్తక పఠనం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు, కవి, సామాజిక కార్యకర్త, జెవివి రాజన్న, రిటైర్డ్ ఉద్యోగి బసవరాజు, ఉపాధ్యాయుడు మహేష్, కెంచప్ప, పాఠకులు జయన్న, ఆనంద్, ప్రకాష్ పాల్గొన్నారు.

రాప్తాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వి.వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ ముగింపు సమావేశం నిర్వహించారు. సర్పంచి ఎస్.తిరుపాలు, రిటైర్డ్ టీచర్ బి.ఆదినారాయణరెడ్డి పాల్గొని ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



గుంతకల్లులో చిన్నారులకు బహుమతులు అందిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, అతిథులు

అలాగే పిల్లలకు స్వీట్స్, బిస్కెట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

గుంతకల్లు : స్థానిక గ్రంథాలయంలో అధికారి కమ్మన్న ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. శిక్షకులను గ్రంథాలయాధికారి ఘనంగా సత్కరించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత, సుప్రసిద్ధ చిత్రకారుడు కె.శ్రీధరన్, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, బి.కుళ్లాయప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు గంగరాజు, శాంతపాల్, ఆంగ్ల భాష శిక్షకులు భువనకుమార్, సహయ గ్రంథాలయ అధికారిణి హేమలత, సిబ్బంది రాము పాల్గొన్నారు.

తాడిపత్రి : పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్.వీరారెడ్డి, కె.సేతు, వి.సూర్యనారాయణరెడ్డి, పెన్షన్ సంఘం అధ్యక్షులు పి.సత్యప్రసాద్ పాల్గొని పోటీల విజేతల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక గ్రంథాలయం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒలు జయానాయక్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు శివప్రసాద్ హాజరయ్యారు. వరలక్ష్మి మాట్లాడుతూ శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ , అవగాహన కల్పించామన్నారు. ఎంఇఒలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వ్యాయామం, క్రీడల్లో రాణించాలన్నారు. గ్రంథాలయానికి వెళ్లడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు యశ్విత, నవదీప్, భాను, చాంద్, జయశ్రీ, రుషిత, ఇందుశ్రీ, సిద్దేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాల్సిందే

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాల్సిందేనని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. 'సేవ్ ఆర్‌డిటి' పేరుతో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మాజీ ఎంపి తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర గురువారం బ్రహ్మసముద్రం మండలంలో కొనసాగింది. బొమ్మగానిపల్లితండా వద్ద యువజన విభాగం నాయకులు తలారి రంగయ్యకు సంఘీభావం తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు. సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 50ఏళ్లకు పైగా విశేష సేవలు అందిస్తున్న ఆర్‌డిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆర్‌డిటికి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్(ఎఫ్‌సిఆర్‌ఎ)ను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు దాదాఖలందర్, ప్రతాప్, జిల్లా కార్యదర్శులు మైను, వేణుగోపాల్, కళ్యాణదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడు తలారి చరణ్, షెక్షా, అజయ్, అంజినాయక్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

విన్సెంట్ ఫెర్రర్ స్మారకార్థం కవితల పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

కరువు సీమలో అభాగ్యుల పాలిట ఆత్మబంధువైన విన్సెంట్ ఫెర్రర్ వర్థంతి సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ అనంతపురం వారి ఆధ్వర్యంలో 'ఆర్‌డిటి సేవలు-అభాగ్యులకు వరాలు' అంశంపై కవితలు ఆహ్వానిస్తున్నట్లు కొప్పల మీనాక్షమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవికాంత్ రమణ తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలో కవితల పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కవితలను ఈ నెల 10వ తేదీ రాత్రి 10 గంటలలోపు 73828 63523 వాట్సాప్ నెంబర్‌కు పంపాలన్నారు. అందులో న్యాయ నిర్ణయితలు ప్రకటించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ కవితల విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను కొరియర్ ద్వారా పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సంస్థ అధ్యక్షులు టివి రెడ్డి, తోట నాగరాజు, ఆశ్రయ అనాథాశ్రమం నిర్వాహకులు యర్రగుంట కృష్ణారెడ్డి, లింగాల పవన్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం ప్రారంభం



కళ్యాణమండపాన్ని ప్రారంభిస్తున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

డి.హీరేహాళ్ మండలంలోని మురడి గ్రామ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్మించిన నూతన కళ్యాణ మండపాన్ని గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచిత సామూహిక వివాహాలు చేసుకున్న జంటలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగేల్ల వెంకటేశులు, టిడిపి మండల కన్వీనర్ యు.హనుమంతరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి కె.నరసింహారెడ్డి, డాక్టర్ హనుమంతరెడ్డి, శ్రీరామరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త రామదాసు అనారోగ్య కారణాల వల్ల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ఆ గ్రామం వెళ్లి రామదాసు మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'జనాభా పాలసీ'పై అభిప్రాయ సేకరణ చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జనాభా నిర్వహణ విధానం పాలసీపై క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం రాత్రి అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జనాభా నిర్వహణ విధానం, ప్రతి కుటుంబం ముఖ్యం, మీ అభిప్రాయం మార్గదర్శనం అనే పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా నిర్వహణ విధానం పాలసీపై అభిప్రాయ సేకరణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. జూన్ 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రజల భాగస్వామ్య సంప్రదింపు కాలపరిమితి ఉంటుందని, సకాలంలో అభిప్రాయ సేకరణ పూర్తి చేయాలన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

బాల్య వివాహాల నివారణకు సమిష్టిగా కృషి చేద్దామని రాకెట్ల పిహెచ్‌సి వైద్యాధికారిని పావని సూచించారు. మండలంలోని రాకెట్ల గ్రామంలో గురువారం వైద్యాధికారిణి పావని ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్. పావని, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ల లోపు వివాహం చేయడం, గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, భ్రూణ హత్యలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే బాల్య వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శేఖర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.